

# ప్రాయశ్చిత్తమా? ప్రతిఫలమా?

నన్నపనేని రాజకుమారి

ఫోన్ మోతతో ఉలిక్కిపడి లేచాను.

రిసీవర్ ఎత్తగానే అవతలినుంచి సిస్టర్ దీనా, "డాక్టర్, అర్జంటుగా మీరు రావాలి. డాక్టర్ రావుగారి అన్నగారట! ఒక పదిహేనేళ్ళ అమ్మాయిని కారులో తీసికొనివచ్చారు. సీరియస్ కేస్‌లాగుంది. ఆయన చాలా కంగారుగా ఉన్నారు. రావుగారు లేరంటే మీకు ఫోన్ చేయమన్నారు" అంది.

"సరే" అని ఫోన్ పెట్టి డ్రైవర్‌ని లేపి కారులో బయలుదేరాను. నిద్రావస్థ! రావుగారి అన్నయ్యట! ఆయన్ను ఎప్పుడు చూడలేదు. కేసేమిటో అని ఆలోచిస్తుండగానే హాస్పటల్ గేటుదాటి లోపల ఆగింది కారు.

నేను వచ్చానని తెలియగానే ఆయన 'రావుగారి అన్నయ్యనని, పాప చాల సీరియస్‌గా ఉందని' టూకీగా చెప్పి, కారులోనుంచి ఆ అమ్మాయిని తీసికొచ్చి టేబుల్ పై పడుకోబెట్టి బయటకు వెళ్ళారు.

పల్స్ చూచాను. నాడి చాల బలహీనంగా ఉంది బట్టలంతా రక్తమయం. పెదవులు చిట్లిఉన్నాయి. బంగారు బొమ్మలాగుంది. నిండా పదిహేనేళ్ళు లేని ముగ్ధలా ఉంది. రేప్ కేసని

చూడగానే తెలిసిపోయింది. ఒళ్ళు జలదరించింది కళ్ళనీళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎంత నిగ్రహించుకుందామన్నా సాధ్యంకావడం లేదు. నా బలహీనత నన్ను వదలటం లేదు.

ఇలాంటి కేసు గురించి విన్నా, చూసినా ఒణికిపోతున్నాను. ఎలా ఈ అమ్మాయిని బ్రతికించాలి? బ్లడ్ చాలా పోయింది. బ్లడ్ ఎక్కించాల్సిన అవసరముందని కాంపౌండర్ని గ్రూప్ చూడమన్నాను. సిస్టర్ క్లీన్ చేస్తోంది. ఇంజక్షన్ ఇచ్చి, బ్లడ్ ఎక్కించటానికి ఏర్పాట్లు చేయమన్నాను. కాంపౌండర్ ఆ అమ్మాయి బ్లడ్ గ్రూప్ మన హాస్పటల్‌లో లేదని చెప్పాడు.

వాళ్ళ ఫాదర్ది కలుస్తుందేమో అనుకున్నాను. అదీ కలవలేదు. ఎలా?

నాలో కంగారు ఎక్కువ అయ్యింది. రావుగారి అన్నకూతురు! ఈ కేసుని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. బయటకు వెళ్లి బ్లడ్ తీసుకొచ్చే టైమ్‌లేదు. రావుగారికీ, నాకూ ఉన్న పరిచయంతో, నా బ్లడ్ అన్నా కలుస్తుందేమోనన్న ఆశతో ప్రయత్నించాను. ఆ అమ్మాయి అదృష్టం కలిసింది. వేరో డాక్టర్‌కు అర్జంటుగా రమ్మని ఫోన్‌చేసి, నేను బ్లడ్ తీయించుకోవటానికి ముందు రావుగారన్నయ్యకు ధైర్యం చెప్పటానికి లోపలికి పిలవమన్నాను


లోపలకు వచ్చి, నమస్కారం చేసి నిలుచున్న ఆయనను చూచి ఉలిక్కిపడ్డాను. యిందాక మఫ్లర్ చుట్టుకుని, కళ్ళజోడు పెట్టుకొని ఉండటం వలన పరిశీలనగా చూడలేదు. మఫ్లరూ, కళ్ళజోడు తీసి కర్చీఫ్‌తో తడికళ్ళను తుడుచుకుంటూ వచ్చినాయన్ని చూచి గుర్తుపట్టాను- నేను నా జీవితంలో మరచిపోలేని వ్యక్తి ఆయన.

పరిసరాలు గుర్తించి, పక్క రూమ్‌లోకి నడిచాను. ఆయన నన్ను అనుసరించాడు నాకు ఆయన రూపురేఖలు అలజడిలో ముంచెత్తాయి. ఆవేశం వస్తోంది ఏడుపు వస్తోంది. ఏం చేయాలి? ఆయన ఎలాటివాడు? ఆయన నాకు ఏమి అవుతాడు? నాకు చేసిన ద్రోహానికి నేను ఆయన బిడ్డను బ్రతికించాలా? లేక అతనిమీద కక్షతో, ఆ అమ్మాయిని నా వల్లకాదని తీసుకెళ్ళమనాలా?- ఇలా ఆలోచన, ఆవేశాల మధ్య ఊగిసలాడుతూ తలపట్టుకొని కూర్చుండిపోయాను.

"డాక్టర్, బ్లడ్ తీయడానికి అన్నీ రెడీ చేశాము, వస్తారా!" అన్న సిస్టర్ పిలుపుతో కళ్ళు తెరిచి చూచాను.

"సిస్టర్, ఒక్క నిముషంలో వస్తాను. నీవు పద!" అని మళ్ళీ కళ్ళుమూసుకున్నాను.

"డాక్టర్, నా బిడ్డను బ్రతికించండి. ఎంత డబ్బు అయినా సరే ఖర్చుచేస్తాను- బ్లడ్ కొంటానికి. ఆలస్యం అవుతుంది



అంటున్నారని, మీ బ్లడ్ ఇస్తారని విని కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వచ్చాను. నా తమ్ముడు రావు. వాడు ఉంటే నా బిడ్డను వాడే బ్రతికించుకొనేవాడు నా దురదృష్టం- వాడు లేకపోవడం. వాడి భుజాలమీద పెరిగింది- 'చిన్నాన్న' అంటూ వాడితోనే కాలం గడుపుతుంది ఎక్కువగా తల్లిలేని పిల్ల. దానికి ప్రాణాపాయం అయితే నాకన్నా ఎక్కువగా వాడు చింతిస్తాడు. అసలు వాడు భరించలేడు-" అని వెక్కి-వెక్కి ఏడుస్తున్న ఆయన్ని చూస్తే ఏమనుకోవాలి? అసహ్యం, చిరాకు కలిగాయి

జాలి వేయవలసిన పరిస్థితిలో అలా అనిపిస్తుంది అంటే నేను దుర్మార్గులని మాత్రం కాదు, నాకు ఆయన చేసిన అన్యాయం అలాంటిది.

అందుకే నేను మాట్లాడటం మొదలు పెట్టాను.

"మీ పేరు శేఖరంగారు కదూ!"

"అవును" అన్నాడు

ఆయనలో ఆశ్చర్యం!

"మీ అమ్మాయి? ఎందుకు జరిగిందిలా?" సూటిగా చూస్తూ అడిగాను.

"ఎవరో దుర్మార్గులు నా బిడ్డను అన్యాయంగా దోచుకున్నారు. కామాంధత్వంతో నా తల్లికి తీరని అన్యాయం చేశారు"- అంటూ పిడికిలి బిగించి పళ్ళు కొరుకుతున్న ఆయనను మధ్యలోనే ఆపి,

"వాళ్ళు దుర్మార్గులు, ఎందుకు? మీ కూతురును రేప్‌చేశారు కనుక? రేప్ చేయడమంటే ఏమిటో మీకు తెలియదా? వాళ్ళు అన్యాయంగా మీ కూతురును దోచుకున్నారు. వాళ్ళు కామాంధులు! 'వాళ్ళు', 'వాళ్ళు' అంటూ పిడికిలి

బిగించి పళ్ళు కొరికారే! వాళ్ళు నిజంగా మీకు కనిపిస్తే చంపుతారు కదూ? చంపలేరు! ఎందుకంటే, ఆనాడు మిమ్మలను ఎవరు చంపగలిగారు? మీకు ఒక నీతి, ఎదుటివారికి ఒక నీతి ఉంటుంది అనుకోకండి. శిక్ష అందరికీ ఒకటే! మానవులకు శిక్షించడం సాధ్యంకాకపోతే భగవంతుడే శిక్షిస్తాడు. మీరు చేసిన నేరానికి ఈనాడు భగవంతుడు పొరబాటున మీ బిడ్డను శిక్షించాడు– అంతే" అని ఏడుస్తూ, ఆవేశంతో ఊగిపోతున్న నన్ను ఆశ్చర్యంగా చూస్తున్న ఆయనతో అన్నాను.

"ఇప్పుడు నన్ను గుర్తుపట్టారా? పదిహేనేళ్ళ క్రితం నీ బిడ్డ పరిస్థితికి నన్ను నీవు తీసికెళ్ళిన సంగతి నీవు మర్చిపోయినా, నేను మర్చిపోలేదు నేను మాచర్లలో మీ ఇంటిప్రక్క చంద్రగారి అమ్మాయి– రాణిని"– అన్న నా మాటలకు అతను ఉలిక్కిపడి, వెంటనే నా కాళ్ళు పట్టుకొని,

"క్షమించు రాణీ! నా బిడ్డను బ్రతికించు. నామీద కోపం నా బిడ్డమీద చూపించకు" అని బ్రతిమాలుతున్న అతనినుండి దూరంగా జరిగి "ఇప్పుడు నీ బిడ్డ ప్రాణం నా చేతిలో ఉంది. అయినా, పదినిమిషాలు ఆలశ్యం చేస్తే నీ బిడ్డ బ్రతకదు. కాని నేను అంత అన్యాయం చేయలేను. నీ బిడ్డను బ్రతికిస్తాను. ఎందుకంటే, ఒక స్త్రీగా, ఒక నాడు అలాంటి పరిస్థితిలో ఉన్నాను కనుక! నేను ఒక డాక్టర్‌ను కనుక! నాలాంటి డాక్టర్ ఆనాడు నా జీవితం ప్రసాదించింది కనుక! కాని, నిన్ను చూచి మాత్రం కాదు! నీవు చేసినదానికి భగవంతుడు నిన్ను శిక్షించకుండా, నీ బిడ్డను శిక్షించడం న్యాయం కాదు. నీవు నాకు చేసిన అన్యాయానికి నేను నీ బిడ్డమీద పగతీర్చుకోవడానికి నేను కనిపించని దేవుణ్ణి కాను! మానవత్వమున్న మనిషిని! కాబట్టి నేను ఆ అమ్మాయిని బ్రతికిస్తాను మీరు వెళ్ళవచ్చు"– అని గబగబ రక్తం తీయించుకొని ఆ అమ్మాయికి ఎక్కించిన తరువాత,కొంచెంసేపు కళ్ళుమూసుకొని పడుకొని, ఆ అమ్మాయికి స్పృహ రాగానే చేయవలసిన ట్రీట్‌మెంట్ చేసి, ఆ అమ్మాయి ఏడుస్తూ ఉంటే, ఓదార్చి ధైర్యం చెప్పాను.

"నా బట్టలు ఇస్తాను. ఆ అమ్మాయి బట్టలు మార్చి, శుభ్రం చెయ్యమని" చెప్పి ఇంటికి బయలుదేరాను.

జరిగిన సంఘటన, రాత్రి నిద్రలేక పోవటం, రక్తం తీయించుకోవడం– అంతా అగమ్యగోచరంగా ఉంది. చాలా నీరసంగా ఉంది. కళ్ళుమూసుకున్నాను. గతం కళ్ళముందు కదలాడింది.

ఆ రోజు నాకు బాగా గుర్తు! నాన్నగారు మాచర్లలో 'జాబ్'చేస్తూ ఉండేవారు. ఇంటిప్రక్క వాటాలో ఓ కాంట్రాక్టర్ గారు ఉండేవారు. ఆయన, భార్య అమ్మ

చాలా సన్నిహితంగా ఉండేవారు. ఆయన చాలా అందంగా ఉండేవారు. ఆయనే శేఖరంగారు. నేను అప్పుడు ఎస్. ఎస్. ఎల్. సి. చదువుతున్నాను. పద్నాలుగేళ్ళ వయసు నాది వయస్సును మించి ఉండే దాన్ని, ఆయన భార్య నన్ను చాలా అందమైనదానివి, తెలివైనదానివి అని పొగుడుతూ ఉండేది. ఆయనకు అప్పటికి పిల్లలు లేరు, ఆమె గర్భంతో ఉండేది.

ఆమెతో అమ్మ అంటుండేది: "మీకు అబ్బాయి కావాలా, అమ్మాయి కావాలా?" అని.

దానికి ఆమె, "మీ అమ్మాయి రాణి లాంటి చక్కని పాప కావాలి" అనేది.

నేను సిగ్గుపడేదానిని. అమ్మ నావంక గర్వంగా చూసుకొని మురిసిపోయేది.

ఓ రోజు ఆయన భార్య అత్తవారింటికి వెళ్ళింది పురిటికి. మా అమ్మ ఆయనకు అన్నం పెట్టడానికి టిఫిన్లు అందివ్వడానికి పంపేది. వెళ్ళినప్పుడల్లా ఆయన హాస్యాలాడటం, నావంక కోరికగా చూడటం చేసేవాడు నేను వెంటనే ఆయన చూపులనుండి తప్పించుకొని వచ్చేదాన్ని.

కొన్ని రోజులకు శేఖరంగారి భార్య ప్రసవించిందని ఆయన చూచి వచ్చి, అమ్మను పురిటికి వెళ్ళమని బలవంతంగా పంపారు. అమ్మకూడా ఆమెకు చీర, పాపకు గౌన్లు తీసికెళ్ళింది. చిన్న చెల్లి అమ్మతో వెళ్ళింది. తతిమ్మావాళ్ళు సెలవులని అమ్మమ్మగారింటికి వెళ్ళారు. నాన్నది ఆ రోజు నైట్ డ్యూటీ.

దగ్గర్లోన ఉన్న తెలిసినవాళ్ళ అమ్మాయి నీరజను తోడుతెచ్చుకొని పడుకొమ్మని నాన్న చెప్పి వెళ్ళారు. పని మనిషికి ఇంటికి వెళ్ళేటప్పుడు నీరజను పిలవమని చెప్పి వాకిట్లో నించున్నాను.

పనిమనిషి వెంటనే తిరిగివచ్చి, "నీరజమ్మగారు సినిమాకు వెళ్ళిందటమ్మా. రాగానే వాళ్ళమ్మగారు పంపుతానన్నారు" అని చెప్పి వెళ్ళిపోయింది.

నేను లోపలకు వెళ్ళిపోయేంతలో శేఖరంగారు వచ్చి తాళాలు అడిగారు.

"ఈ రోజు మీరు రారనుకున్నాను. అమ్మ రాలేదేం?" అని అడిగాను.

"అమ్మను అంటివాళ్ళు రానివ్వలేదు. రేపు రాత్రికి వస్తారు." అని నా వంక ఒకసారి చూచి లోపలకు వెళ్ళారు.

వెళ్ళిన కొద్దినిముషాలకు "రాణీ!" అని పిలిచారు. నేను అన్నం, కూరలు ఉంచే ఆయనకు పెడదాం అని వంట ఇంటిలోకి పోబోతున్నాను

"ఏమిటీ?" అని అడగగానే, "నేను హోటల్లో తినివచ్చాను. నాకు ఆకలిగా లేదు తలనొప్పిగా ఉంది. అమృతాంజనం కావాలి" అన్నారు

"టాబ్లెట్ ఉంది తెస్తా"నని గ్లాసుతో నీళ్ళు, టాబ్లెట్ తీసిఇవ్వడానికి దగ్గరగా వెళ్ళాను.

అయన లేచి గబగబ తలుపులు వేసి వచ్చారు. ఒక్కసారి ఉలిక్కిపడి, "ఏమి

ఉండి!" అని అడిగాను. ఏమీలేదంటూ మారు మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా నన్ను నాశనం చేశారు. ఎంత ప్రతిఘటించినా ఆయన బలమైన బంధం నుండి తప్పించుకోలేకపోయాను. ఏడ్చినా ప్రయోజనం లేకపోయింది.

ఆ తరువాత అమ్మావాళ్ళతో చెప్పవద్దని బ్రతిమిలాడారు. నా అందం ఆయనను పిచ్చివాడిని చేసిందట! భార్య ఎడబాటు ఆయన తొందరపాటుకు కారణమైందట! ఇలా చెప్పి నన్ను ఓదార్చి, నన్ను అయోమయంలో పడవేసి, ఇంటికి తాళంవేసి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత కొద్దిరోజులకు ఇక్కడ కాంట్రాక్టు అయిపోయిందని మరోచోటికి వెళ్ళిపోతున్నామని చెప్పి, ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు. ఎవ్వరితోనూ ఆ రాత్రి జరిగింది చెప్పక ఊరుకున్నాను. ఆయన వెళ్ళిపోయాడు. నాకు ఆయన మీద ఏ భావం లేదు. తెలిసీ తెలియని వయసు అమ్మావాళ్ళతో చెపితే నన్నేతిడతారేమో! జరిగింది చాలా తప్పు పని. పదిమందికి తెలియటానికి వీలులేదు.

రిజల్ట్సు వచ్చి ఫస్టున పాస్ అయితే పి.యు.సి. లో చేరతానని చెప్పాను. వుమెన్సు కాలేజీలో జాయిన్ అయ్యాను.


శేఖరంగారితో ఆ సంఘటన జరిగి నెల దాటింది అప్పడప్పుడు మనస్సులో ముల్లులా తొలుస్తూ ఉండేది. ఆయన గుర్తువస్తే కోపం వచ్చేది. ఏడ్పువచ్చేది మర్చిపోవటానికి ప్రయత్నించినా, మరపురాక, 'తప్పు, తప్పు' అని పదేపదే అనిపిస్తుంది.

'మంచి పెళ్ళి సంబంధం' అని ఓ రోజువచ్చారు-నాన్న. నేను రాను, నాకు ఇప్పుడు పెళ్ళివద్దు-అని మొండిగా చెప్పి పంపివేశాను. తరువాత కొద్ది రోజులకు నాకు నెల తప్పిందని తెలుసుకున్నాను. వణికిపోయాను. ఏడుస్తూ కూర్చున్నాను. నా ఫ్రెండ్ వాళ్ళ డాక్టర్ దగ్గరకు - తీసికెళ్ళింది. ఆమె గర్భిణీ అని చెప్పి, చివాట్లు పెట్టింది. సిగ్గుతోను, బాధతోను తలవంచుకొని రూముకు వచ్చాను అన్నం తినక, క్లాసుకు వెళ్ళక, ఏడుస్తూ ఉన్న నన్ను వార్డెన్ 'సంగతేమిటి' అని అడిగింది.

జరిగింది చెప్పాను. వెంటనే నాన్నను పిలిపించారు. అమ్మా, నాన్నా వచ్చారు. ఎవరో చెప్పమన్నారు. నేను నోరు విప్పలేదు. నాన్న నోటికి వచ్చినట్లు తిట్టారు. అమ్మ ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లింది.

వార్డెన్ అంది. "మా అక్క డాక్టర్. ఆమెతో చెప్పి ఎబార్షన్ చేయిస్తాను"అని, నాన్నకు ధైర్యం చెప్పింది. ఆమెకు నా లాంటి అమ్మాయి ఉండేదట. అందుకే నేనంటే అభిమానం. నాన్న అమ్మను వదిలి, ఆ పని చేయించి రమ్మని, తను ఊరు వెళతానని చెప్పి వెళ్ళారు.

నన్ను వెంటనే హాస్పిటల్లో జాయిన్ చేయటం, గర్భం పోవటం-అన్నీ గంటల్లో జరిగాయి. 'హమ్మయ్య' అని




అమ్మ ఊపిరి పీల్చుకునేంతలో నాన్న చనిపోయారన్న కబురు. తరువాత బాధ్యతలు అమ్మ నెత్తిన పడటం- వార్డెన్‌గారు నాకు ధైర్యాన్ని నూరి పోశారు. నా చదువుకు ప్రోత్సాహం లభించింది.

ఏమైనా నాన్న చావుకు, అమ్మ వైధవ్యానికి, చెల్లెళ్ళు అనాధలు అవటానికి నేనే కారణం అని వూహించి, కర్తవ్యం గుర్తించి, ఆ రోజునుండి దీక్షగా చదివి ఫస్టున పాస్ అయ్యాను. స్కాలర్ షిప్పులు సంపాదించి, వార్డెన్‌గారి లాంటి వారివలన, పెద్ద డాక్టర్ రాంచంద్రగారి దయవలన నేను మంచి భవిష్యత్తు ఏర్పరచుకొని, డాక్టర్ని అయ్యాను. చెల్లెళ్ళను చదివించుతున్నాను వాళ్ళకు పెళ్ళిళ్లు చేయగల స్థితిలో ఉన్నాను. కానీ శేఖరం గారి వలన నేను శీలాన్ని పోగొట్టు

కున్నాను. నేను పెళ్ళికి అనర్హురాలిని. మా నాన్నను పోగొట్టుకొన్నాను అనిపించినపుడు, శేఖరంగారు కనిపిస్తే తిట్టి, కొట్టాలి-అన్నంత ఆవేశం వచ్చేది.

రావుగారు నన్ను చేసుకుంటాను అన్నారు. "నాకు చాలా బాధ్యతలు ఉన్నాయి-" అని మృదువుగా తిరస్కరించాను. నా జీవితం ఇలా మోడులా అయినందుకు, గతం నన్ను వెక్కిరిస్తూ ఉన్నందుకు కారణం-శేఖరంగారు. ఈ నాడు ఆయన బిడ్డను బ్రతికించాను. ఎందుకు? ఆయనకోసమా? రావు అన్న కూతురనా? డాక్టర్‌గానా? తోటి స్త్రీగానా? ఆ బాలిక అనుభవం నాకు కలిగినందుకా? ఏమైనా కారణమేదైనా ఆవేశాన్ని అణచుకొని, ఆ అమ్మాయిని బ్రతికించాను అన్న తృప్తి మిగిలింది-అనుకుంటూ నిట్టూర్చాను.

"అమ్మగారూ" అన్న డ్రైవర్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చి నీరసంగా కారుదిగి లోపలకు నడచిన నాకు ఎదురుగా గోడకు వేళాడుతున్న గాంధీ, బుద్ధుడు, క్రీస్తుల నిలువెత్తు ఫోటోలపై దృష్టి నిలిపాను. చేతులెత్తి ఆ ముగ్గురు మూర్తులు ఆశీర్వదిస్తున్నట్లు అనిపించి, ఆనందంగా కళ్ళుమూసుకొని పడక కుర్చీలో చేరగిలబడ్డాను.

"రాణీ! రాణీ!" అన్న రావుగారిపిలుపుతో, "ఎప్పుడు వచ్చా"రని అడిగి, కాలకృత్యాలు తీర్చుకొని వచ్చాను. నేనో కప్పు, రావుకో కప్పు కాఫీ తీసుకొని వచ్చి రావుకు ఎదురుగా కూర్చున్నాను.

రావు, "నీతో ముఖ్యవిషయం మాట్లాడాలి. రాత్రి మా కుటుంబానికి చాలా మేలు చేశారు. మా అన్నయ్య అంతా చెప్పాడు. లోగడ మీ గురించి అన్నయ్యతో చెప్పాను. మీరు అంగీకరించలేదు. మీరు వివాహానికి అనర్హులని, చెల్లెళ్ళ బాధ్యత చాలా ఉందని, సుముఖంగా లేనని చెప్పినప్పుడు నేను బాధపడ్డాను. నేను ఇంకా కొంతకాలం మీ కోసం వేచి ఉండటానికి నిశ్చయించుకొన్నాను. ఈ రోజు అన్నయ్య జరిగింది చెప్పి, మిమ్మల్ని నన్ను వివాహం చేసుకోమన్నాడు. మీ గురించి ఏమీ తెలియనపుడు మిమ్ములను ఎన్నుకున్నాను. మా అన్నయ్య ద్వారా విన్నప్పుడు ఇంకా నా అభిప్రాయం బలపడింది కాదనకండి-" అని జాలిగా, దృఢనిర్ణయంగాను అడుగుతున్న రావుగారివంక చూస్తూ అనుకున్నాను.

నా గురించి శేఖరంగారు రావుకి ఏమి చెప్పారు? జరిగింది ధైర్యంగా చెప్పారా? వాళ్ళ తమ్ముడిని నన్ను చేసికొమ్మని మనస్ఫూర్తిగా అన్నారా? అవును మరి! తన కూతురికి ముందు ముందు నా పరిస్థితి వస్తుందిగా! అందుచేతనా? లేక తను నాకు చేసిన దానికి ప్రాయశ్చిత్తంగానా! లేక తన కూతురిని బ్రతికించినందుకా? రక్తదానం చేసినందుకు ప్రతిఫలంగానా?" ఇలా ఆలోచనా స్రవంతి నన్ను సమాధానం చెప్పకుండాచేసింది.